క్లుప్తంగా

వృథాగా మంచినీటి తొట్లు



ఖాళీగా దర్శనం ఇస్తున్న నీటితొట్టి

పుల్లలచెరువు: గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం మంచి ఆశయంతో మంచినీటి తొట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మండలంలోని 19 పంచాయతీల్లో 54 తొట్లు మంజూరు కాగా వాటిలో 45 తొట్లు నిర్మించారు. ఒక్కో తొట్టిని సుమారు రూ.35 వేలు ఖర్చు చేసి నిర్మించారు. చాలా గ్రామాల్లో ఆ తొట్లలో నీరు ఉండటం లేదని పశుపోషకులు వాపోతున్నారు. తొట్లను నీరు ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలోని పశువులకు ఉపయోగపడేలా ఉండాలని ఆదేశాలు ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తొట్లు నిర్మించాం.. వదిలేశాం..అన్న రీతిలో ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఏది ఏమైనా మంచి ఆశయంతో ఏర్పాటు చేసిన తొట్లు పశువులకు ఉపయోగపడేలా వాటిల్లో నీరు నింపేలా చూడాలని మండలంలోని వివిధ గ్రామాల్లోని పశుపోషకులు కోరుతున్నారు.

రెండు బైకుల ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు



లాజర్‌కు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కర్నూల్–గుంటూరు జాతీయ రహదారిపై ఐనముక్కల పశు వైద్యశాల సమీపంలో శుక్రవారం జరిగింది. ప్రమాదంలో మండల పరిధిలోని తిమ్మాపురానికి చెందిన లాజర్, యడవల్లికి చెందిన సింగా నానీలు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రం నుంచి ద్విచక్ర వాహనంపై యడవల్లి వైపునకు వెళ్తున్న సింగా నానీకి చెందిన ద్విచక్ర వాహనం , ఆత్మకూరు వైపు నుంచి మండల కేంద్రం వైపునకు వస్తున్న ద్విచక్ర వాహనం ఐనముక్కల వద్ద ఒకదానికొకటి ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో లాజర్ తలకు గాయాలుకాగా నానీకి కనపడని గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయిస్తున్నారు.

బృహద్ వారాహి అలంకారంలో జగదాంబ అమ్మవారు



మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలోని జగదాంబ అమ్మవారు వారాహి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం బృహద్ వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

వానర సైన్యంతో బెంబేలు

- ప్రజలపై కోతుల దాడులు
- భయాందోళనలో చిన్నారులు



కోతుల గుంపు

పెద్దదోర్నాల: మండలంలో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చింది. ఒక్కసారిగా పదుల సంఖ్యలో ఇళ్లపై పడి చిన్న చిన్న వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. ఇళ్లల్లో వస్తువులను చిందర వందర చేస్తున్నాయి. చిన్నారుల చేతుల్లో ఉన్న తినుబండారాలను లాక్కెళ్తున్నాయి. ఈ క్రమంలో అవి తమను ఎక్కడ కరుస్తాయోనన్న ఆందోళన చిన్నారుల్లో వ్యక్తమవుతోంది. మండల కేంద్రం పెద్దదోర్నాలతో పాటు తిమ్మాపురం, ఐనముక్కల, యడవల్లి, గంటవానిపల్లె తదితర నల్లమల పరిసర గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. అవి విచ్చలవిడిగా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడంటూ ప్రజలు వాపోతున్నారు. చివరకు మండలంలో ప్రస్తుతం కోతుల సమస్యే ప్రధాన సమస్యగా మారిపోయింది. ఇళ్లల్లో, రోడ్లపై, పంట పొలాల్లో, షాపుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడపడితే అక్కడ సంచరిస్తూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

మండలంలో కోతుల బెడద అధికంగా ఉన్నా అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కోతుల నివారణకు కొండ ముచ్చులను తీసుకొచ్చి వీధుల వెంట తిప్పటం వంటి పనులు చేసి చేసి కోతులను తరిమేయాల్సి ఉంది. గతంలో పూర్తిస్థాయిలో కోతులను పట్టుకోక పోవడంతో సమస్య మరింత తీవ్రతరమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు వాటి ఉత్పత్తి సైతం ప్రతి ఆరు నెలలకు ఒకసారి కావడంతో వాటి సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కోతులను చూస్తూనే విపరీతంగా భయపడాల్సి వస్తోంది.

పెరుగుతున్న కోతుల సంఖ్య

కోతుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో విపరీతంగా సంచరించే వీటిని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వీటి నుంచి తప్పించుకునే క్రమంలో వేటగాళ్ల ద్వారా పట్టుకొని వాటిని నల్లమల పరిహద్దు అటవీ ప్రాంతాల్లో వదిలిపెడుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో వీటి ఉనికి క్రమేపీ విస్తరిస్తోంది. కర్నూల్, శ్రీశైలం జాతీయ రహదారులపై మర్కటాలు చేసే హడావుడికి అంతే లేదు. దీంతో పాటు పాఠశాలలోని చిన్నారులు సైతం కొనుగోలు చేసిన తినుబండారాల కోసం దాడులు చేస్తుండంతో కోతుల దెబ్బకు చిన్నారులు సైతం గాయాలపాలవుతున్నారు.

కోతుల దాడులు ఎక్కువయ్యాయి:



మండలంలో కోతుల దాడులు క్రమేపీ ఎక్కువయ్యాయి. లగేజీ కవర్లతో ఇళ్లకు వెళ్తున్న వారిపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని కోతులను పట్టించే కార్యక్రమం చేపట్టి వాటి బెడద నుంచి ప్రజలను కాపాడాలి.

– ఈదర బ్రహ్మం, పెద్దదోర్నాల

సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

దర్శి (కురిచేడు): మోదీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని కోరుతూ జూలై 9న చేపట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు పిలుపునిచ్చారు. సీఐటీయూ దర్శి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఈమని నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి తెచ్చుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేసి కార్మిక, ఉద్యోగులకు వ్యతిరేకంగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కొత్త చట్టాలు మోదీ ప్రభుత్వం తెస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 10 గంటల పని విధానం అమలు చేయాలని మంత్రి వర్గం ఆమోదించిందని, ఇది కార్మికుల హక్కులను హరించటమే అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పిన విధంగానే చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 5 వేల మంది ఉద్యోగులను తొలగించారని, ఈ సంవత్సరం రైతు పండించిన వరి, పొగాకు, మిర్చి, కంది, పత్తి ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధరలు అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోయి దివాళా తీస్తున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం స్కీం వర్కర్స్ అయిన అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ వర్కర్స్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో అమలు చేయలేదని ఇలా 40 శాతం మందికి తల్లికి వందనం పథకానికి దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలపై జూలై 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల నాయకులు చిరుపల్లి అంజయ్య, కుందుర్తి అనిల్, ఉప్పు నారాయణ, అలూరి స్మాయిల్, జాలా సుశీల, గర్నెపూడి జాన్ సామ్యేల్, షేక్ కాలే బాషా, పంటా ఏడుకొండలు, టి.లక్ష్మి, చిట్లా ఆది నారాయణ, అంజిబాబు, దాసు పాల్గొన్నారు.

నత్తనడకన తారురోడ్డు పనులు



అసంపూర్తిగా నిలిచిన రోడ్డు

పెద్దారవీడు: కూటమి ప్రభుత్వ పెద్దలు మాటలకు చేతలకు పొంతన కుదరడం లేదు. సంక్షేమం, అభివృద్ధి తమకు రెండు కళ్లు అని చెప్పుకుంటున్నా ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నందున మండలంలో రోడ్ల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కింద మద్దలకట్ట గ్రామం నుంచి చాట్లమడ అగ్రహారం గ్రామం వరకు 2.10 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు మట్టి రోడ్డు కష్టాలు లేకుండా చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచాయి. ఈ రహదారిలో ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై కంట్రాక్టర్ కంకర, డస్ట్ మిశ్రమం వేయడంతో పాటు రోడ్డు మార్జిన్లకు మట్టి వేశారు. మిగిలిన పనులు చేయక పోవడంతో వాహనాల రాకపోకలకు కంకర రాళ్లపై ప్రయాణం సాగించేందుకు చాలా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు కంకరపై నుంచి ఆటోలు, సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. రోజూ చాట్లమడ అగ్రహారం, చాట్లమడ గ్రామాల నుంచి మద్దలకట్ట గ్రామం ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ముందు వెళ్తున్న వాహనం వెనుకాల వెళ్తున్న వాహనదారులు దుమ్ము కళ్లు, ముక్కుల్లో చేరడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన తారు రోడ్డును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎఫ్‌పీఓగా మారితే బహుళ ప్రయోజనాలు



ఎఫ్‌పీఓల గురించి వివరిస్తున్న ప్రదీప్‌కుమార్‌రెడ్డి

దర్శి (కురిచేడు): దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రం వేదికగా కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గుర్తించిన 29 పీఏసీఎస్ సభ్యులకు ఎఫ్‌పీఓపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఆప్కాబ్ విజయవాడ సౌజన్యంతో నిర్వహించిన శిక్షణలో ఆప్కాబ్ ఏజీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌పీఓల ప్రాముఖ్యతను వివరించారు. రైతులను బలోపేతం చేసేందుకు 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా 206 ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీలు (పీఏసీఎస్), ఎన్‌సీడీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలపై ఆధారపడి గ్రామీణ రుణాలు మరియు వ్యవసాయ అభివృద్ధిలో వారి ప్రస్తుత పాత్రను పరిగణనలోకి తీసుకుని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ)గా గుర్తించబడ్డాయన్నారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ఈ పథకం కింద పీఏసీఎస్‌ను ఎఫ్‌పీఓలుగా గుర్తించినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఈఆర్వో



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జాన్సన్

తాళ్లూరు: దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.జాన్సన్ మండలంలోని తాళ్లూరు ,శివరాంపురం పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు ర్యాంపులు ఏర్పాటు చేశారా లేదా.. అని పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, బూత్ లెవెల్ అధికారులు, వీఆర్వోలు ఉన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో ఆర్థిక స్వావలంబన



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

దర్శి (కురిచేడు): వృత్తి నైపుణ్య శిక్షణతో ఆర్థిక స్వావలంబన వైపు మహిళలు పయనించాలని ఎంపీడీఓ ఎల్.కృష్ణమూర్తి పేర్కొన్నారు. నైపుణ్య అభివృద్ధి, ఔత్సాహిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మండలంలోని పోతవరం పంచాయతీ తిమ్మాయిపాలెం ఎస్సీ కాలనీలో శుక్రవారం మహిళలకు టైలరింగ్‌పై ఆయన శిక్షణ ప్రారంభించి మాట్లాడారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. ఆధునిక కాలంలో మహిళలు తప్పకుండా ఏదో ఒక వృత్తి శిక్షణతో ఉపాధి పొందొచ్చన్నారు. జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.గ్రామ్ సునీల్ మాట్లాడుతూ మహిళలకు, గృహిణులకు వివిధ రకాల వృత్తి విద్య, శిక్షణ కార్యక్రమాలతో స్వయం ఉపాధి వైపు పయనించవచ్చని పేర్కొన్నారు. దళిత బహుజన సెంటర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎం. హేమలత మాట్లాడుతూ మహిళలు ఆధునిక కాలంలో ఏదో ఒక వృత్తి విద్యలో శిక్షణ పొందాలని, ఇలాంటి శిక్షణ ఇచ్చే సంస్థల సేవలను ఉపయోగించుకుని ప్రభుత్వ పథకాలతో ఆర్థిక స్వావలంబన వైపు పయనించాలని కోరారు. డీబీఆర్‌సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బులమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రాయితీపై విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ

మార్కాపురం: రాష్ట్రంలోని గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్‌ను 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని ఆ శాఖ ఏడీ సియానాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదనపు లోడ్ ఒక కిలోవాట్ ధర 2,250 కాగా రాయితీ పోను రూ.1250 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఈ అవకాశం ఈ నెల 30వ తేదీ వరకు ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీసీపీడీసీఎల్ సర్కిల్లోని సమీప ఎలక్ట్రికల్, రెవెన్యూ ఆఫీస్, ఈ సేవ కేంద్రాలు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌ను సందర్శించి అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకోవచ్చని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారులు

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు ప్రాథమిక వైద్యశాల డాక్టర్లుగా విజయకుమార్‌రెడ్డి, ఎస్పీ.బాలయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయకుమార్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా పలాస మండలం నుంచి కొనకనమిట్లకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎస్పీ.బాలయ్య గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాలకు బదిలీ అయ్యారు. గొట్లగట్టులో ఇటీవల వరకు పనిచేసిన పృథ్వీరాజ్ పీజీ చదివేందుకు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్లకు ఆయా వైద్యశాలల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సీసీఆర్‌సీ కార్డుల జారీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

దొనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతులకు అందజేసే సీసీఆర్‌సీ కార్డులపై వీఆర్‌ఓలకు శుక్రవారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డుల జారీపై విధి విధానాలు వివరించారు. 2025–26 సంవత్సరానికి దొనకొండ మండలానికి 906 కార్డులు జారీ చేయాలని, ఇందుకోసం రైతులు తమ రైతు సేవా కేంద్ర పరిధిలో వీఆర్‌ఓలను సంప్రదించాలన్నారు. సంబంధిత గ్రామాల్లోని రెవెన్యూ సిబ్బంది రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే కార్డులు మంజూరు చేయాలని సిబ్బందికి తహసీల్దార్ సూచించారు. వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ రైతులకు సీసీ కార్డులు ఉంటేనే ఈ–పంట నమోదు, పంటల బీమా, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. కాలపరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. కౌలు కార్డులు ఇస్తే పంట మీద హక్కు ఉంటుందని, భూమిపై ఉండదని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కేవీ నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలు చదవడం, నోట్ పుస్తకాలు రాయడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో ఇందిర అన్నారు. శుక్రవారం మండలంలోని యండ్రపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాల రుచి చూశారు. పాఠశాలలో కిట్లు పంపిణీ, విద్యార్థుల రోల్ గురించి హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం ఇచ్చే శిక్షణ నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక చూపుతూ రాయడం, చదవడం నేర్పించాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు అంశాలను చదవడం, రాయడం నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

హైదరాబాద్‌కు ఇంద్ర బస్సులు ఏర్పాటు చేయాలి

కంభం: గిద్దలూరు నుంచి కంభం, మార్కాపురం మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఇంద్ర బస్సు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని శుక్రవారం విజయవాడలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం ఇచ్చినట్లు షెడ్యూల్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు తెలిపారు. గిద్దలూరు, కంభం నుంచి రోజూ సుమారు 500 మంది హైదరాబాద్ వెళ్తుంటారని, గిద్దలూరు డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేయాలని ఎండీని కోరినట్లు వివరించారు.

పీడీసీసీబీకి మేనేజర్ నియామకం

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: బేస్తవారిపేటలోని ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ రెండు నెలలుగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రుణాలు ఇవ్వకపోవడం, గతంలో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేయకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఈ నెల 20వ తేదీన 'సబ్సిడీ దూరం.. అదనపు వడ్డీ భారం' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కురిచేడు బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న దేవశెట్టి శ్రీనివాసులును బేస్తవారిపేట పీడీసీసీబీకి మేనేజర్‌గా నియమించారు. రెగ్యులర్ మేనేజర్ బాధ్యతలు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.


సబ్సిడీ దూరం.. అదనపు వడ్డీ భారం

రైతుల కష్టాలపై 'సాక్షి'లో ఇటీవల ప్రచురించిన కథనం

స్కూల్ బస్సుల ప్రమాదాల నివారణ బాధ్యత యాజమాన్యాలదే..

- సీఐ సుబ్బారావు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలు, డ్రైవర్లపై ఉందని సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. స్కూల్ బస్సుల్లో భద్రతా లోపాలను సరిదిద్దాలని చెప్పారు. బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు, పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణ సామగ్రి ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థినులకు గుడ్‌టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణంలో స్కూల్ బస్సులు నెమ్మదిగా నడపాలని డ్రైవర్లకు సూచించారు. సమావేశంలో ఎస్సైలు రాజమోహన్‌రావు, సైదుబాబు, అహరోన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద మహిళల కోలాటం

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని రాయవరం(ఆర్ఎస్) వద్ద కొలువై ఉన్న బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పురుషోత్తమాచార్యులు, లక్ష్మణచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం, అనంతరం శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. రాత్రికి స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.